సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం । 29 । అక్టోబర్ । 2023



చిన్నబోయిన సుజాతనగర్

ఉమ్మడి జిల్లాలో ఒకప్పుడు పెద్ద నియోజకవర్గంగా వెలిగిన సుజాతనగర్ రాజకీయ చిత్రపటం నుంచి కనుమరుగైంది. 10లో



సీఎం సభలకు ఏర్పాట్లు

వచ్చేనెల 1, 5 తేదీల్లో ఇల్లెందు, కొత్తగూడెంలో నిర్వహించనున్న సీఎం కేసీఆర్ ప్రచార సభలకు ఏర్పాట్లు చేస్తున్నారు. 12లో

గరిష్టం / కనిష్టం
32° / 22°

వాతావరణం

జిల్లాలో ఆదివారం తెల్లవారుజామున, రాత్రి చల్లటి వాతావరణం ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు మాత్రం అధికంగానే నమోదవుతాయి.

న్యూస్‌రీల్

ఆలయాల మూసివేత



మూసివేసిన శ్రీ బాలాజీ ఆలయం

దుమ్ముగూడెం/అన్నపురెడ్డిపల్లి : పాక్షిక చంద్ర గ్రహణం నేపథ్యంలో పర్ణశాల శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయం, అన్నపురెడ్డిపల్లిలోని శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి, శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయాలను శనివారం సాయంత్రం మూసివేశారు. తిరిగి ఆదివారం ఉదయం సంప్రోక్షణ, స్వామివారి మూలమూర్తులకు అభిషేకం, ఉత్సవ తిరుమంజనం అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తామని అర్చకులు తెలిపారు.

ఎన్నికల ప్రక్రియ ముగిసేవరకు ప్రజావాణి రద్దు

సూపర్‌బజార్(కొత్తగూడెం) : జిల్లా అధికారులు ఎన్నికల విధుల్లో భాగస్వాములైనందున సోమవారం నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ముగిసేంత వరకూ ఈ కార్యక్రమాన్ని కొనసాగించలేమని స్పష్టం చేశారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ప్రజావాణిలో ఫిర్యాదులు, వినతులు అందించేందుకు రావద్దని కోరారు.

నవోదయలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కూసుమంచి: పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను 9, 11వ తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసులు తెలిపారు. ప్రస్తుతం 8, 10వ తరగతి చదువుతున్న వారు దరఖాస్తుకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఆన్‌లైన్‌లో ఆధార్ కార్డు ఓటీపీ ఆధారంగా ఈనెల 31 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు వచ్చే ఏడాది ఫిబ్రవరి 10వ ప్రవేశపరీక్ష నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఏజెన్సీలో డీఎఫ్ఓ పర్యటన



అటవీ ప్రాంతంలో పర్యటిస్తున్న డీఎఫ్ఓ

చర్ల రూరల్: మండలంలోని ఏజెన్సీ గ్రామాల్లో జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణగౌడ్ శనివారం పర్యటించారు. చర్ల అటవీ రేంజ్ పరిధిలోని గీసరెల్లి నుంచి బత్తినపల్లి వరకు నిర్మించబోయే రహదారుల ప్రదేశాలను పరిశీలించారు. ఏజెన్సీ గ్రామాల అభివృద్ధికి రహదారుల నిర్మాణానికి అటవీ శాఖ అనుమతి కోరడంతో ఆయన పరిశీలన చేపట్టారు. డీఎఫ్ఓ వెంట చర్ల ఎఫ్ఆర్ఓ పి.ఉపేంద్ర, డీఆర్ఓ హచ్యా తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్‌కు గురుకుల విద్యార్థులు

ఇల్లెందు: వచ్చే నెల 6 నుంచి 9 వరకు వరంగల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ మీట్‌కు ఇల్లెందు మైనార్టీ గురుకుల విద్యార్థులు ఎంపికయ్యారు. శనివారం ఖమ్మంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో అండర్–19 బాలుర విభాగంలో గురుకుల విద్యార్థులు కబడ్డీ, ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆర్ఎల్‌సీ అరుణకుమారి, సీతారాములు, జమీల్, ప్రిన్సిపాల్ ముదసిర్ హుస్సేన్, పీడీ నజీముద్దీన్, అధ్యాపకులు కొండల్‌రావు, అశోక్, సాధిక్ అభినందించారు.

ఇల్లెందు నుంచి మేడారానికి బస్సు...



ఇల్లెందు బస్టాండ్.

ఇల్లెందు: ఇల్లెందు నుంచి మేడారానికి ప్రతీ ఆదివారం బస్సు నడుపనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. శనివారం ఇల్లెందు బస్ డిపో ఎస్టీఐ సంజీవరాణి వివరాలు వెల్లడించారు. ఉదయం 5.30 గంటలకు ఇల్లెందు నుంచి బయల్దేరే బస్సు గుండాల మీదుగా పస్రా, మేడారానికి 10 గంటల లోపు చేరుకుంటుందని తెలిపారు. సాయంత్రం 4 గంటలకు తిరిగి మేడారంలో బయలుదేరి రాత్రి 8 గంటలకు ఇల్లెందుకు చేరుకుంటుందని పేర్కొన్నారు. పెద్దలకు రూ.160, పిల్లలకు రూ.90 టికెట్ ధర నిర్ణయించినట్లు వివరించారు.

అభయహస్తం ఎవరికో ?

ఇల్లెందు టికెట్ తనదేనంటున్న కాంగ్రెస్ ఆశావహులు

- రెండో జాబితాలోనూ ఎవరికీ దక్కని చోటు
- టికెట్‌పై నమ్మకం పెట్టుకున్న 'కోరం'
- తమకే ఇవ్వాలంటున్న బంజారాలు



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఇల్లెందు నియోజకవర్గంలో కాంగ్రెస్ రాజకీయం ఊహించని మలుపులు తిరుగుతోంది. నిన్నా మొన్నటి వరకు కాంగ్రెస్ అభ్యర్థిగా కోరం కనకయ్య పేరు దాదాపు ఖరారనే పరిస్థితి నెలకొంది. కానీ రెండో జాబితాలో కూడా అభ్యర్థిని ప్రకటించకుండా కాంగ్రెస్ అధిష్టానం పెండింగ్‌లో పెట్టింది. దీంతో మూడో జాబితాలో కోరం కనకయ్య పేరు ఉంటుందా ? కొత్త వారు తెరపైకి వస్తారా అనే చర్చ మొదలైంది.

రెండో విడతలోనూ నిరాశే..

కోరం కనకయ్య ప్రస్తుతం జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఉన్నారు. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరారు. జెడ్పీ చైర్మన్ హోదాలో చేరడంతో ఇల్లెందు నుంచి కాంగ్రెస్ టికెట్ ఆయనకే దక్కుతుందనే ప్రచారం జోరుగా సాగింది. దీనికి తగ్గట్టే కనకయ్య కూడా నియోజకవర్గంలో గడపగడపకూ ప్రచారం ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ 55 మందితో ప్రకటించిన తొలి జాబితాలోనే కోరం పేరు ఉంటుందనే నమ్మకం ఆయన మద్దతుదారుల్లో ఉండేది. కానీ తొలి, మలి జాబితాలోనూ కనకయ్యకు చోటు దక్కలేదు.

లంబాడీలకు ఇవ్వండి..

ఇల్లెందు నుంచి పోటీ చేసే అవకాశం లంబాడీలకు ఇవ్వాలని ఆ సామాజిక వర్గానికి చెందిన ఆశావహులు కొత్త నినాదం తెర మీదకు తీసుకొచ్చారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఐదు ఎస్టీ రిజర్వ్‌డ్ స్థానాలు ఉండగా అందులో కనీసం ఒక చోటైనా లంబాడీలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర స్థాయిలో 12 ఎస్టీ రిజర్వ్‌డ్ సీట్లు ఉన్నాయని, అందులో కోయ, లంబాడీలకు చెరో ఆరు చొప్పున ఇవ్వాలని తమ వాణిని గట్టిగా వినిపించారు. రోజులు గడుస్తున్న కొద్దీ విన్నపాలు, నిరసనల ద్వారా తమ నినాదాన్ని మరింత విస్తృతంగా ప్రచారంలోకి తీసుకెళ్తున్నారు. దీంతో మరోసారి గెలుపు అవకాశాలు, సామాజిక సమీకరణలను బేరీజు వేసి నిర్ణయం తీసుకోవాలని అధిష్టానం నిర్ణయించుకుంది. దీంతో ఇల్లెందు స్థానాన్ని పెండింగ్‌లో పెట్టింది.

ఆశావహుల్లో ఉత్కంఠ..

రెండో జాబితాలోనూ ఇల్లెందుకు అభ్యర్థిని ప్రకటించకపోవడంతో స్థానిక కాంగ్రెస్ ఆశావహుల్లో ఉత్కంఠ పెరుగుతోంది. టికెట్‌పై గంపెడాశలు పెట్టుకున్న కోరం కనకయ్య మద్దతుదారుల్లో ఆందోళన మొదలైంది. జిల్లా పరిషత్ చైర్మన్ హోదాలో పార్టీలోకి వచ్చిన కనకయ్యకే టికెట్ ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు రెండో జాబితాలో కోరం పేరు లేకపోవడంతో ఇల్లెందు సీటు బంజారాలకే అనే నమ్మకం ఆ సామాజికవర్గ నేతల్లో నెలకొంది. ఇక్కడి నుంచి టికెట్ ఆశిస్తున్న బంజారా నేతల్లో కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరామ్ నాయక్ తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. ఇంకా కామేపల్లి జెడ్పీటీసీ ప్రవీణ్‌నాయక్, డాక్టర్ జి.రవి, అజ్మీర శంకర్‌నాయక్, భూక్యా దళ్‌సింగ్ ఎవరికి వారు తమకే టికెట్ దక్కుతుందనే అంచనాల్లో ఉన్నారు.

అసంతృప్తిపై గులాబీ ఫోకస్..

ఎన్నికలు సమీపిస్తుండటంతో సరికొత్త రాజకీయ వ్యూహాలకు బీఆర్ఎస్ పదును పెడుతోంది. ఇప్పటికే బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఊకె అబ్బయ్యను పార్టీలోకి చేర్చుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. దీనికి తోడు ఇల్లెందు కాంగ్రెస్ టికెట్ కోసం అధికంగా పోటీ ఉండటంతో అసంతృప్త నేతలకు గాలం వేసేందుకు గులాబీ పెద్దలు స్కెచ్ వేస్తున్నారు. అభ్యర్థి ప్రకటన తర్వాత తలెత్తే పరిస్థితులకు అనుగుణంగా నిరాశతో ఉన్న నాయకులకు గులాబీ కండువా కప్పేందుకు అనుగుణంగా వ్యూహ రచన చేస్తున్నట్లు సమాచారం.

రికార్డు స్థాయిలో దరఖాస్తులు..

కోరం కనకయ్య కాంగ్రెస్ పార్టీలో చేరడానికి ముందు కనీసం ఐదుగురు ఆశావహులు ఇల్లెందు టికెట్‌పై నమ్మకం పెట్టుకుని పని చేసుకుంటూ వచ్చారు. కనకయ్య రాకతో తమ ఆశలు సన్నగిల్లినట్టేనని వారు కూడా భావించారు. కానీ పోటీ చేసేందుకు ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని స్వయంగా పీసీసీ సూచించడంతో ఇల్లెందు టికెట్ కోసం రికార్డు స్థాయిలో 32 మంది దరఖాస్తు చేసుకున్నారు. నాటి నుంచి నేటి వరకు ఆశావహులంతా గాంధీభవన్, ఢిల్లీలో ఏఐసీసీ భవన్ చుట్టూ చక్కర్లు కొడుతూ టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. చివరకు కోరం కనకయ్యకు తప్ప తమలో ఎవరికి టికెట్ ఇచ్చినా పర్వాలేదంటూ హై కమాండ్‌కు తేల్చి చెప్పారు.

జంగ్ తెలంగాణ

శబరికి స్మృత్యంజలి



స్వామి వారికి ఫల, పుష్పాలు సమర్పిస్తున్న అర్చకులు



స్వామి వారికి పండ్లు, పూలు తీసుకొస్తున్న గిరిజనులు, ఆలయ అధికారులు

- అపర భక్తురాలికి ఫల, పుష్పాలతో ప్రత్యేక పూజలు
- గిరిజన సంప్రదాయ నృత్యాలతో మురిసిన భద్రగిరి
- దేవస్థానం ఆధ్వర్యంలో గిరిజనులకు సత్కారం



శబరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు



సంప్రదాయ నృత్యం చేస్తున్న ఆదివాసీలు

భద్రాచలం: భద్రాద్రి రామయ్యకు అపర భక్తురాలిగా పేరుగాంచిన శబరికి ఘనంగా స్మృత్యంజలి ఘటించారు. పరమ భక్తితో రామయ్యకు ఎంగిలి పండ్లను సమర్పించి ఆయనను మెప్పించిన శబరికి గిరిజనుల సమక్షంలో భద్రగిరి క్షేత్రంలో శనివారం వైభవంగా ఉత్సవం నిర్వహించారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో ప్రతి ఏడాది అశ్వయుజ పౌర్ణమి రోజున శబరి స్మృతి యాత్ర నిర్వహించడం ఆనవాయితీ. 2013లో ప్రారంభమైన ఈ ఉత్సవాన్ని అదే రీతిలో కొనసాగిస్తున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసి గిరిజనులను, కుల పెద్దలను ముందస్తుగానే భద్రాచలం తరలించి వసతి సదుపాయం కల్పించారు.

శబరికి ఘన ఫల, పుష్పాంజలి

శబరి చిత్రపటంతో మేళతాళాలు, భక్తుల శ్రీరామ నామస్మరణల నడుమ ఊరేగింపుగా గిరి ప్రదక్షిణ చేశారు. చప్టా దిగువన ఉన్న తూము నరసింహదాసు, భక్త రామదాసు విగ్రహాలకు ఆలయ ఈఓ ఎల్.రమాదేవి పూలమాలలు వేయగా, అర్చకులు హారతి ఇచ్చారు. శబరి విగ్రహానికి కూడా పూలు, పండ్లు, వస్త్రాలు సమర్పించారు. గిరిజనుల వేషధారణలు, కొమ్ము నృత్యాలతో చేసిన ఊరేగింపు అందరినీ ఆకట్టుకుంది. అనంతరం బేడా మండపంలో కొలువై ఉన్న స్వామి వార్లకు, శబరికి గిరిజనులు పలు రకాల పండ్లు, పూలను సమర్పించగా, ఆలయ అర్చకులు పుష్పాంజలి నిర్వహించారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణోత్సవాన్ని వైభవోపేతంగా జరిపించగా, గిరిజనులు కనులారా వీక్షించారు. శబరి స్మృతియాత్రకు హాజరైన గిరిజన దంపతులకు ఈఓ వస్త్రాలు అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ భవానీ రామకృష్ణ, గిరిజన కుల పెద్దలు ముర్ల రమేష్, పూనెం కృష్ణ, తెల్లం వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌పురం వద్ద ప్రత్యేక పూజలు

ఆంధ్రప్రదేశ్‌లోని వరరామ చంద్రాపురం సమీపంలోని శబరి నది వద్ద భద్రాద్రి రామాలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అక్కడున్న శబరి విగ్రహానికి నదీ జలంతో అభిషేకం చేశారు. అనంతరం రామయ్య తరుపున తీసుకెళ్లిన వస్త్రాలతో అలంకరించి హారతి, నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో పండితులు లింగాల అవధాని, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అమరుల త్యాగం చిరస్మరణీయం

ఎస్పీ డాక్టర్ వినీత్



ఓపెన్ హౌస్‌లో ఆయుధాలను పరిశీలిస్తున్న ఎస్పీ

కొత్తగూడెంఅర్బన్: దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని ఎస్పీ డాక్టర్ వినీత్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శనివారం కొత్తగూడెం త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోలీస్ అమరుల త్యాగాలను అందరికీ తెలియజేసేందుకే సైకిల్ ర్యాలీలు, రక్తదాన శిబిరాలు, ఆన్‌లైన్ ఓపెన్ హౌస్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలోని సుమారు 120 ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పోలీసులు ఉపయోగిస్తున్న ఆయుధాలపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. పోలీసు జాగిలాల పని తీరును కూడా విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా వివరించామని తెలిపారు. కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్, సీఐలు మురళి,కరుణాకర్, అడ్మిన్ ఆర్ఐ రవి, ఎంటీఓ సుధాకర్, వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు, ఆర్ఐ నాగేశ్వరరావు, ఐటి కోర్ ఇన్‌చార్జ్ సీఐ సతీష్, ట్రాఫిక్ ఎస్సై నరేష్ పాల్గొన్నారు.

రేపటి లోగా యూడైస్ ఎన్‌రోల్‌మెంట్ పూర్తి చేయాలి

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో యూడైస్ ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమం ఈనెల 30వ తేదీ లోగా పూర్తి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరాచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానోపాధ్యాయులంతా ఆయా పాఠశాలల విద్యార్థుల వివరాలను యూడైస్ లాగిన్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ సంవత్సరం కొత్తగా చేరిన విద్యార్థులను ఇంపోర్ట్ చేసుకోవాలని పేర్కొన్నారు. స్కూల్ రిజిస్టర్‌లో ఉన్న విద్యార్థులు, యూడైస్ ప్లస్ లాగిన్‌లో ఉన్న విద్యార్థులు సమానంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఏమైనా సందేహాలుంటే నివృత్తి కోసం జిల్లా ప్లానింగ్ కో –ఆర్డినేటర్ ఎస్.సతీష్‌కుమార్‌ను సంప్రదించాలని తెలిపారు.

డిజిటల్ మిషన్‌లో వివరాలు నమోదు చేయాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ శిరీష

కొత్తగూడెంరూరల్: ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌లో భాగంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రులు హెచ్ఎఫ్ఆర్(హెల్త్ ఫ్యాకల్టీ రిజిస్ట్రేషన్) ఆన్‌లైన్ పోర్టల్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జే.వీ.ఎల్. శిరీష తెలిపారు. డీఎంహెచ్ఓ కార్యాలయంలో శనివారం డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో పనిచేసే మెడికల్, పారా మెడికల్ సిబ్బంది ప్రతి ఒక్కరూ హెచ్‌పీఆర్ (హెల్త్ ప్రొఫెషనల్ రిజిస్ట్రేషన్)ను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమోలు ఎండీ ఫైజ్‌మొయిద్దీన్, నాగలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్లు బేబి రమాదేవి, డేటా ఎంట్రీ ఆపరేటర్లు రమేష్, శివ, స్ఫూర్తి, ప్రవీణ, సంధ్య, తార, శారద, శిరీష, రమాదేవి, శివ, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

నివేదికలు అందజేయండి

కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఎన్నికల ప్రక్రియకు అవసరమైన మినీ, పెద్ద వాహనాల కోసం నివేదికలు అందజేయాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం ఆయా శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల పరిధిలోని 1,095 పోలింగ్ కేంద్రాలకు మెటీరియల్ సరఫరాకు 138 సెక్టార్లు, 149 రూట్లుగా విభజించినట్లు తెలిపారు. పోలింగ్ నిర్వహణకు 4,380 మంది సిబ్బంది, 2,190 మంది పోలీసులతో జాబితా సిద్ధం చేసినట్లు చెప్పారు. జిల్లాలో మొత్తం 217 వాహనాలు అవసరం అవుతాయని ప్రాథమికంగా నివేదికలు రూపొందించామని, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో అందుబాటులో ఉన్న వాహనాల జాబితా అందజేయాలని రవాణా శాఖాధికారులకు సూచించారు. నవంబర్ 3 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం అవుతున్నందున రిటర్నింగ్ అధికారులు తమ కార్యాలయాల్లో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని సూచించారు. నామినేషన్ల దాఖలుకు కావాల్సిన ధ్రువీకరణలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ ప్రక్రియను వీడియో, ఫొటోగ్రఫీ చేయించాలని చెప్పారు. నియోజకవర్గ పరిధిలో సిటీ కేబుళ్లలో ప్రసారమయ్యే రాజకీయ ప్రకటనలను పర్యవేక్షించాలని అన్నారు. కేబుల్ ఆపరేటర్లతో సమావేశం ఏర్పాటుచేసి ఈసీ మార్గదర్శకాలను వివరించాలన్నారు. సమావేశంలో అశ్వారావుపేట, కొత్తగూడెం, భద్రాచలం రిటర్నింగ్ అధికారులు రాంబాబు, శిరీష, మంగీలాల్, డీఆర్ఓ రవీంద్రనాథ్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు దారా ప్రసాద్ పాల్గొన్నారు.

ఓటు నమోదుకు 31 వరకు అవకాశం..

అర్హులైన వారంతా ఓటు హక్కు నమోదు చేసుకునేందుకు ఈనెల 31 వరకు అవకాశం ఉందని జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక ఆల తెలిపారు. విద్య, ఉద్యోగాల రీత్యా స్వస్థలాలకు దూరంగా ఉండే వారు ఆన్‌లైన్ విధానంలో నూతన ఓటుకు దరఖాస్తు చేసుకోవచ్చునని చెప్పారు. కేంద్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్ తీతీతీ. ఽతిటఽ జీ., ల్పొటట ృఽజీ. జౌఠి. జీుతో పాటు తీతీతీ.. ఛ్పొ్పొ ఽఞ్చ్ఛ. ఽజీఛి. జీు వెబ్‌సైట్‌ల ద్వారా నమోదుకు అవకాశం ఉందని వివరించారు. లేదంటే టోల్ ఫ్రీ నంబర్ 1950కు ఫోన్ చేసినా సమాచారం ఇస్తామని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలో పేరు లేకపోయినా, పేరులో దోషాలు ఉన్నా ఈ లోపే సరిచేసుకోవాలని సూచించారు.

కార్మిక క్షేత్రంలో కాంగ్రెస్ హవా

- మొదట పాల్వంచ, ఆ తర్వాత కొత్తగూడెం నియోజకవర్గంగా మార్పు
- ఏడుసార్లు విజయం సాధించిన హస్తం పార్టీ
- ప్రభావితం చేయనున్న కార్మికుల ఓట్లు




పానుగంటి పిచ్చయ్య



చేకూరి కాశయ్య



కోనేరు నాగేశ్వరరావు





వనమా వెంకటేశ్వరరావు



కూనంనేని సాంబశివరావు



జలగం వెంకట్రావ్

కొత్తగూడెంఅర్బన్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పాల్వంచ, కొత్తగూడెం జంట పట్టణాలుగా ప్రఖ్యాతి గాంచాయి. కొత్తగూడెం సింగరేణి బొగ్గు ఉత్పత్తికి నిలయం కాగా, పాల్వంచ కేటీపీఎస్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా గుర్తింపు పొందాయి. ఈ రెండింటితో పాటు నవభారత్, సిల్ వంటి పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల ఓట్లే ఇక్కడి అభ్యర్థుల జయాపజయాలను ప్రభావితం చేసేవి. 1957లో పాల్వంచ నియోజకవర్గ కేంద్రంగా ఎన్నికలు జరిగాయి. అయితే నియోజకవర్గాల పునర్విభజన అనంతరం 1978లో కొత్తగూడెం నియోజకవర్గం ఏర్పాటైంది. 1957 నుంచి ఇప్పటి వరకు ఇక్కడ అత్యధిక సార్లు కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధించారు. ఆ పార్టీ ఏడుసార్లు గెలుపొందగా, మూడుసార్లు టీడీపీ, రెండుసార్లు సీపీఐ, ఒకసారి జనతా పార్టీ, ఒకసారి బీఆర్ఎస్ విజయం సాధించాయి. కొత్తగూడెం నియోజకవర్గం జనరల్‌గా ఉండడం అన్ని వర్గాల వారికి కలిసొచ్చిన అంశంగా చెప్పొచ్చు. 1962లో భారత్ – చైనా యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో పర్సా సత్యనారాయణ సీపీఐ అభ్యర్థిగా జైలులో ఉండి నామినేషన్ వేసి గెలుపొందడం నాటి నిజాయితీ రాజకీయాలకు నిదర్శనం.

కార్మికుల ఓట్లే కీలకం..

కొత్తగూడెం నియోజకవర్గంలో కార్మికుల ఓట్లు కీలకంగా మారాయి. కొత్తగూడెం, రుద్రంపూర్, గౌతంపూర్, రామవరం, 4 ఇంక్‌లైన్ వంటి ప్రాంతాల్లో సింగరేణి కార్మికులు ఎక్కువగా ఉంటారు. గతంలో, ప్రస్తుతం కూడా వీరి ఓట్లు ఇక్కడ అభ్యర్థుల గెలుపోటములను ప్రభావితం చేస్తాయి. పాల్వంచలో కేటీపీఎస్ కార్మికులు, ఉద్యోగులు, అధికారుల ఓట్లు ఎక్కువగా ఉన్నాయి. అందుకోసం ఎమ్మెల్యేగా బరిలో నిలిచే అభ్యర్థులు ఈ ప్రాంతాలపై ఎక్కువగా దృష్టి సారిస్తారు. కొత్తగూడెం నియోజకవర్గంలో 253 పోలింగ్ కేంద్రాలు ఉండగా పురుష ఓటర్లు 1,14,995 మంది, మహిళా ఓటర్లు 1,21,886 మంది.. మొత్తం 2,36,903 మంది ఉన్నారు. వీరిలో మొదటి సారి ఓటు హక్కు వినియోగించుకునే వారు 5,882 మంది కాగా, 80 ఏళ్ల పైబడిన వారు 3,202 మంది ఉన్నారు.

ఇప్పటివరకు గెలిచిన ఎమ్మెల్యేల వివరాలిలా..

సంవత్సరం	విజేత	పార్టీ	సమీప అభ్యర్థి
పాల్వంచ నియోజకవర్గం			
1957	కె.సుదర్శన్‌రావు	కాంగ్రెస్	సత్యనారాయణ
1962	పి.సత్యనారాయణ	సీపీఐ	కె.వి.రావు
1967	పానుగంటి పిచ్చయ్య	కాంగ్రెస్	పి.సత్యనారాయణ
1972	చేకూరి కాశయ్య	కాంగ్రెస్	ఎం.కొమరయ్య
కొత్తగూడెం నియోజకవర్గం			
1978	చేకూరి కాశయ్య	జనతా	వనమా వెంకటేశ్వరరావు
1983	కోనేరు నాగేశ్వరరావు	టీడీపీ	చేకూరి కాశయ్య
1985	కోనేరు నాగేశ్వరరావు	టీడీపీ	పి.సుధాకర్‌రెడ్డి
1989	వనమా వెంకటేశ్వరరావు	కాంగ్రెస్	కోనేరు నాగేశ్వరరావు
1994	కోనేరు నాగేశ్వరరావు	టీడీపీ	వనమా వెంకటేశ్వరరావు
1999	వనమా వెంకటేశ్వరరావు	కాంగ్రెస్	ఎ.నాగమణి
2004	వనమా వెంకటేశ్వరరావు	కాంగ్రెస్	కోనేరు నాగేశ్వరరావు
2009	కె.సాంబశివరావు	సీపీఐ	వనమా వెంకటేశ్వరరావు
2014	జలగం వెంకట్రావ్	టీఆర్ఎస్	వనమా వెంకటేశ్వరరావు
2018	వనమా వెంకటేశ్వరరావు	కాంగ్రెస్	జలగం వెంకట్రావ్

చిన్నబోయిన సుజాతనగర్ !


సుజాతనగర్ వ్యూ

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఒకప్పుడు పెద్ద నియోజకవర్గంగా ఖ్యాతిగడించిన సుజాతనగర్ ప్రస్తుతం రాజకీయ చిత్రపటం నుంచి పూర్తిగా కనుమరుగైంది. 1978 పునర్విభజనలో ఏర్పడ్డ ఈ అసెంబ్లీ సెగ్మెంట్ 2009 పునర్విభజనలో రద్దయింది. సుజాతనగర్ నియోజకవర్గంలో ఏన్కూరు, జూలూరుపాడు, కామేపల్లి మండలాలు పూర్తిగా, ఖమ్మం అర్బన్, ఖమ్మం రూరల్, కొణిజర్ల, కారేపల్లి, కొత్తగూడెం, టేకులపల్లి, గార్ల మండలాలు పాక్షికంగా ఉండేవి. ఒక ఉప ఎన్నిక సహా ఇక్కడ మొత్తం ఎనిమిది పర్యాయాలు ఎన్నికలు జరగగా.. సీపీఐ, కాంగ్రెస్ చెరో నాలుగుసార్లు గెలుపొందాయి. – సుజాతనగర్

ఇక్కడి గతం.. ఆసక్తికరం

- 2009లో నియోజకవర్గం కనుమరుగు
- ఎనిమిది సార్లు ఎన్నికల్లో ముగ్గురే విజేతలు
- నేడు సాధారణ గ్రామ పంచాయతీగా మనుగడ

సీపీఐ వరుస విజయాలు

సుజాతనగర్ నియోజకవర్గంలో సీపీఐ అభ్యర్థి మహమ్మద్ రజబ్ అలీ వరుసగా నాలుగు సార్లు విజయం సాధించారు. ఆయన మరణానంతరం జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి వెంకటరెడ్డి విజయం సాధించారు. ఆ తర్వాత మరో రెండుసార్లు ఆయన విజయం సాధించడం విశేషం. ముప్పై ఏళ్ల పాలన క్రమంలో కేవలం ముగ్గురు అభ్యర్థులే ఇక్కడ నుంచి ప్రాతినిధ్యం వహించారు. 2009లో చేపట్టిన పునర్విభజనలో ఈ నియోజకవర్గంలోని ఏన్కూరు, కొణిజర్ల, జూలూరుపాడు, కారేపల్లి మండలాలతో పాటు, మధిర నియోజకవర్గంలో కొనసాగిన వైరా మండలాన్ని కలిపి కొత్తగా వైరా నియోజకవర్గం ఏర్పాటు చేశారు. దీంతో 30 ఏళ్లపాటు నియోజకవర్గంగా కొనసాగిన సుజాతనగర్ గ్రామపంచాయతీ కేంద్రంగా మిగిలిపోయింది. ఇక కొత్త జిల్లాల ఏర్పాటులో భద్రాద్రి కొత్తగూడెంలో కలిసింది. ఇప్పుడు మండల కేంద్రంగా కొనసాగుతుండగా... నాటి గురుతులు నేటికీ సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి.

ఎప్పుడెప్పుడు ఎవరు గెలిచారంటే...

సంవత్సరం	విజేత	పార్టీ
1978	బొగ్గారపు సీతారామయ్య	కాంగ్రెస్ (ఐ)
1983	ఎండీ రజబ్ అలీ	సీపీఐ
1985	ఎండీ రజబ్ అలీ	సీపీఐ
1989	ఎండీ రజబ్ అలీ	సీపీఐ
1994	ఎండీ రజబ్ అలీ	సీపీఐ
1996	రాంరెడ్డి వెంకటరెడ్డి	కాంగ్రెస్
1999	రాంరెడ్డి వెంకటరెడ్డి	కాంగ్రెస్
2004	రాంరెడ్డి వెంకటరెడ్డి	కాంగ్రెస్

రాంరెడ్డి ప్రస్థానం


రాంరెడ్డి వెంకటరెడ్డి (ఫైల్)

రజబ్ అలీ మరణాంతరం 1996లో జరిగిన ఉప ఎన్నికల్లో కమ్యూనిస్టుల కంచుకోటలో కాంగ్రెస్ పాగా వేసింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి వెంకటరెడ్డి విజయం సాధించారు. సీపీఎం, టీడీపీ మద్దతుతో పోటీ చేసిన రాంరెడ్డి సీపీఐ అభ్యర్థి టీ.వీ.చౌదరిని ఓడించారు. 1999 ఎన్నికల్లోనూ కాంగ్రెస్ హవా కొనసాగింది. టీడీపీ నుంచి పోట్ల నాగేశ్వరరావు, సీపీఐ నుంచి కూనంనేని సాంబశివరావు, కాంగ్రెస్ నుంచి రాంరెడ్డి వెంకటరెడ్డి బరిలో నిలవగా.. రాంరెడ్డి విజయం సాధించారు. 2004 ఎన్నికల్లో టీడీపీ నుంచి పోట్ల మాధవి, సీపీఐ నుంచి కూనంనేని సాంబశివరావు, కాంగ్రెస్ నుంచి రాంరెడ్డి పోటీ చేయగా.. రాంరెడ్డి మళ్లీ గెలుపొందారు. 1996, 1999, 2004లలో వరుసగా మూడుసార్లు గెలిచిన రాంరెడ్డి వెంకటరెడ్డి హ్యాట్రిక్ సృష్టించారు. 2009లో పునర్విభజనలో సుజాతనగర్ నియోజకవర్గం కనుమరుగు కావడంతో 2009, 2014లో రాంరెడ్డి వెంకటరెడ్డి పాలేరు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. తద్వారా ఆయన రెండు నియోజకవర్గాల్లో కలిపి ఐదు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైనట్లయింది.

తొలి ఎమ్మెల్యే సీతారామయ్య


బొగ్గారపు సీతారామయ్య (ఫైల్)

1978లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సుజాతనగర్ తొలి ఎమ్మెల్యేగా బొగ్గారపు సీతారామయ్య కాంగ్రెస్(ఐ) నుంచి పోటీ చేసి సీపీఐ నేత పువ్వాడ నాగేశ్వరరావుపై విజయం సాధించారు. బొగ్గారపు సీతారామయ్య, పువ్వాడ నాగేశ్వరరావులు ఇరువురు కలిసి న్యాయవిద్యను అభ్యసించినా రాజకీయాల్లో మాత్రం ప్రత్యర్థులుగా పోటీచేశారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, నిజాం హైదరాబాద్ సంస్థానం పాలన విముక్తి కోసం జరిగిన పోరాటంలో పాల్గొన్న వ్యక్తిగా సీతారామయ్య గుర్తింపు పొందారు. ప్రముఖ న్యాయవాదిగా, శాసనసభ అంచనాల కమిటీ అధ్యక్షునిగా, ప్యానెల్ స్పీకర్‌గా సేవలందించారు. ఈ ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థి పువ్వాడ నాగేశ్వరరావు, సీపీఎం బలపర్చిన జనతా పార్టీ అభ్యర్థి గోగినేని సత్యనారాయణ మధ్యే పోటీ ఉంటుందని అప్పట్లో అంతా భావించారు. రాజకీయ అంచనాలకు అందని విధంగా సీతారామయ్య ఇందిరా కాంగ్రెస్ పార్టీ పక్షాన గెలిచి అందరినీ ఆశ్చర్యపరిచారు. హైకోర్టు న్యాయవాదిగా సైతం పనిచేసిన ఆయన కరోనాతో మృతి చెందారు.

రజబ్ అలీది చెరగని ముద్ర


రజబ్ అలీ (ఫైల్)

సీపీఐ నుంచి మహ్మద్ రజబ్ అలీ సుజాతనగర్ నియోజకవర్గం నుంచి వరుసగా మూడు సార్లు గెలిచి హ్యాట్రిక్ సాధించారు. తొలిసారి 1983లో కాంగ్రెస్(ఐ) అభ్యర్థి మహ్మద్ ఇస్మాయిల్‌పై గెలుపొందారు. రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ విజయం సాధించినా ఆ పార్టీ అభ్యర్థి సామినేని రాఘవులుకు ఇక్కడ కేవలం 12 వేల ఓట్లే వచ్చాయి. ఆ తర్వాత 1985, 1989, 1994 అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం, సీపీఎం మద్దతుతో వరుసగా సీపీఐ అభ్యర్థి రజబ్ అలీ కాంగ్రెస్ నేత రాంరెడ్డి వెంకటరెడ్డిపై విజయం సాధించారు. ఒకమారు కాంగ్రెస్ అధిష్టానం చేకూరి కాశయ్యకు టికెట్ ఇవ్వగా...రాంరెడ్డి వెంకటరెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యారు. ఆ ఎన్నికల్లో చేకూరికి కేవలం 10 వేల ఓట్లే వచ్చాయి.

● ఇక మోత మోగాల్సిందే!



ఎన్నికల ప్రచారం ఇక హోరెత్తనుంది. నెలరోజులపాటు మైకుల మోత మోగనుంది. రాజకీయ పార్టీలు ప్రచారం కోసం అన్ని హంగులు సమకూర్చుకుంటుండగా, అభ్యర్థులు, పార్టీ అధినేతల ఫొటోలతో కూడిన ప్రచార వాహనాలు సిద్ధమయ్యాయి. ఈ వాహనాల ద్వారా ఊరూరా ప్రచారాన్ని వేడెక్కించేందుకు సిద్ధమవుతున్నారు. ఖమ్మం బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు సంబంధించి ప్రచార వాహనాలు శనివారం ఖమ్మం నగరంలో ఇలా బారులుదీరి కనిపించాయి. –స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం

బొగ్గు గనులు, డిపార్ట్‌మెంట్ల వద్ద ప్రచారం నిషేధం



సింగరేణి(కొత్తగూడెం): అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని గనులు, డిపార్ట్‌మెంట్ల వద్ద ఎన్నికల ప్రచారాన్ని నిషేధించారు. ఈ మేరకు సింగరేణి యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సంస్థ నిర్దేశించుకోగా, ఎన్నికల ప్రచారానికి అనుమతిస్తే కార్మికుల పని గంటలు వృథా అవుతాయనే భావనతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయమై యాజమాన్యం సింగరేణి వ్యాప్తంగా జీఎం కార్యాలయాలకు ఇటీవల ఉత్తర్వులు జారీ చేసి పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. ఇందుకోసం సెక్యూరిటీ సిబ్బందిని అప్రమత్తం చేయాలని ఆదేశించింది. కాగా, నిబంధనలు ఉల్లంఘించి ఎవరైనా ప్రచారానికి వస్తే చర్యలు తీసుకోవడమే కాక, ఉద్యోగులు సహకరించినా శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రూ.3.26 లక్షల నగదు సీజ్

దమ్మపేట/కారేపల్లి: ఎన్నికల వేళ పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా దమ్మపేట మండలంలోని మందలపల్లి చెక్‌పోస్ట్ వద్ద శనివారం రెండు కార్లలో తరలిస్తున్న రూ.1,86,200 నగదును గుర్తించారు. నగదు తీసుకెళ్తున్న వారి వద్ద సరైన పత్రాలు లేకపోవడంతో సీజ్ చేశారు. ఇక కారేపల్లి మండలంలోని క్రాస్‌రోడ్డులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.1.40 లక్షల నగదును సీజ్ చేసినట్లు ఎస్ఐ పుష్పాల రామారావు తెలిపారు.

క్లుప్తంగా

తప్పు చేసిన వారికి శిక్ష పడాలి

భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్


మాట్లాడుతున్న ఏఎస్పీ పరితోష్ పంకజ్

భద్రాచలంఅర్బన్: తప్పుచేసిన వారికి శిక్ష పడేలా పక్కా సాక్ష్యాలను సేకరించి కోర్టుకు అందించాలని భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. శనివారం పట్టణంలోని ఏఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన భద్రాచలం, చర్ల, దుమ్ముగూడెం పోలీస్‌స్టేషన్ల కోర్టు కానిస్టేబుళ్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంబంధిత ప్రభుత్వ కోర్టు అధికారులతో సమన్వయం చేసుకోవాలని పేర్కొన్నారు. భద్రాచలం సీఐ నాగరాజు రెడ్డి, ఏఎస్ఐ గంజి. శశిధర్, దుమ్ముగుడెం హెడ్‌కానిస్టేబుల్ రమేష్, సిబ్బంది నవీన్, సురేష్ బాబు, సైదులు పాల్గొన్నారు.

లారీ ఢీ : ఒకరికి గాయాలు

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లో టిఫిన్ కోసం తీసుకుని వస్తున్న క్రమంలో లారీ ఢీకొని ఓ వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు, బాధుతుడి బంధువుల కథనం ప్రకారం.. పోస్టాఫీస్ సెంటర్ సన్యాసీకి చెందిన కంజర్ల మహేష్ కూలి పని చేస్తూ భార్య, పిల్లలతో జీవనం కొనసాగిస్తున్నాడు. రాత్రి వేళ టిఫిన్ తీసుకుని ఇంటికి వెళ్తున్న క్రమంలో పోస్టాఫీస్ సెంటర్ సర్కిల్ వద్ద యూటర్న్ తీసుకుంటున్నాడు. అదే సమయంలో ఖమ్మం వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టడంతో మహేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. తలకు దెబ్బ తగడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. స్థానికులతో సమాచారంతో అక్కడకు చేరుకున్న వన్‌టౌన్ ఎస్ఐ విజయ క్షతగాత్రుడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయాలకు చికిత్స చేస్తున్న డాక్టర్లు మహేష్ పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు.

పశువుల పట్టివేత

భద్రాచలంఅర్బన్: అక్రమంగా గోవులను తరలిస్తున్న వాహనాన్ని భద్రాచలంలో శనివారం పోలీసులు పట్టుకున్నారు. లారీలో ఐదు ఆవులు, నాలుగు గోవులను తరలిస్తుండగా పట్టుకుని పాల్వంచలోని అన్న పూర్ణ గోసంరక్షణ సమితికి అప్పగించారు. గోవులను అక్రమంగా తరలిస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జంతు ప్రేమికులు కోరుతున్నారు.

గృహోపకరణాలు దగ్ధం

ఇల్లెందురూరల్: మండలంలోని పోలారం గ్రామపంచాయతీకి చెందిన వెంకన్న గౌడ్ అనే వ్యక్తి ఇంట్లో శనివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా గృహోపకరణాలు, సామగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయి. టీవీ, ఫ్యాన్లు, కలప సామగ్రి, దుస్తులు, ఇతర సామగ్రి కూడా పూర్తిగా దగ్ధమైందని, రూ. 3 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని స్థానికులు తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,231

ఉత్పత్తి లక్ష్యం సాధించాలి

సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి


బొగ్గు ఉత్పత్తి ప్రక్రియను పరిశీలిస్తున్న సింగరేణి అధికారులు

మణుగూరు రూరల్ : బొగ్గు ఉత్పత్తి, రవాణా లక్ష్యాలను సాధించేందుకు పునరంకితం కావాలని సింగరేణి డైరెక్టర్(ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) జీ.వెంకటేశ్వరరెడ్డి అన్నారు. సూచించారు. శనివారం ఆయన మణుగూరు ఏరియాలోని ఓసీ–2, ఓసీ–4 గనులను సందర్శించారు. బొగ్గు ఉత్పత్తి ప్రక్రియను, కంటిన్యూయస్ మైనర్ యంత్రం పని తీరును, కేసీహెచ్‌సీలో సీ–10 బెల్ట్ ద్వారా బొగ్గు రవాణా తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ బొగ్గు ఉత్పత్తి ప్రక్రియలో అవరోధాలకు తావు లేకుండా రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. రక్షణ వారోత్సవాల స్ఫూర్తితో నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని చెప్పారు.

అప్రమత్తంగా ఉండాలి

సోలార్ విద్యుత్ ప్లాంట్‌లో ఉద్యోగులందరూ నిబద్ధతతో పనిచేయాలని, ప్రమాదాలకు తావు లేకుండా అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని సింగరేణి అధికారులు సూచించారు. 54వ రక్షణ వారోత్సవాల్లో భాగంగా మణుగూరు ఏరియాలోని 30మెగావాట్ల సింగరేణి సోలార్ పవర్ ప్లాంట్‌ను శనివారం రక్షణ తనిఖీ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా జీఎం(ఈఅండ్ఎం) జేసురత్నం పిట్జ్ గెరాల్డ్ మాట్లాడుతూ సంస్థ పురోభివృద్ధిలో సోలార్ పవర్ ప్లాంట్లు ఎంతో కీలకంగా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఏరియా జీఎం దుర్గం రామచందర్, అధికారులు నర్సిరెడ్డి, లక్ష్మీపతిగౌడ్, వీరభద్రుడు, మదన్ నాయక్, సురేష్, శ్రీనివాస్, షబ్బీరుద్దీన్ , కె చంద్రలింగం, సాజీవ్‌కుమార్, ఎస్.మధుసూదన్, శోభన్, విజయ్‌పాల్, రాజిరెడ్డి, రవి, బి.శ్యామ్ ప్రసాద్ పాల్గొన్నారు.

శ్మశానవాటికపై ఇరువర్గాల వివాదం

తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన


వాగ్వాదానికి చేసుకుంటున్న ఇరువర్గాలు

అశ్వారావుపేటరూరల్: దాదాపు నాలుగు దశాబ్దాలుగా ఉమ్మడిగా ఉన్న శ్మశానవాటికపై దళిత కులాల మధ్య వివాదం నెలకొంది. శనివారం రెండు వర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం నెలకొంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని నారాయణపురం రెవెన్యూ మౌజా, సర్వే నంబరు 516లో ఆరు ఎకరాల స్థలాన్ని గడిచిన నాలుగు దశాబ్దాలుగా నారాయణపురం కాలనీకి చెందిన రెండు దళిత కులాల వారు ఉమ్మడిగా శ్మశాన వాటికగా వినియోగిస్తున్నారు. గడిచిన కొద్ది రోజులుగా శ్మశాన వాటిక స్థలం విషయంలో ఇరువర్గాల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే శనివారం ఉదయం ఓ వర్గంవారు ఆ స్థలంలో ట్రెంచ్ తవ్వుతుండగా, మరో వర్గంవారు వచ్చి అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటు చేసుకుంది. కొందరు యువకులు కందకంలో బైఠాయించడంతో దాదాపు గంటపాటు ఉద్రిక్తత నెలకొంది. కాగా ఆ స్థలంలో మన్యం భూమి ఉందని, అక్కడ పేదలు ఇళ్ల నిర్మాణం చేసుకుంటటారని ఓ వర్గంవారు చెబుతున్నారు. దీనిపై తమకు న్యాయం చేయాలని మరోవర్గంవారు అశ్వారావుపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. డీటీకి ఫిర్యాదు చేశారు.

చున్నీ ద్విచక్రవాహనంలో చిక్కుకుని..

మహిళా ఎస్ఐకి తీవ్రగాయాలు


చికిత్స పొందుతున్న ఎస్ఐ జుబేదా

కొత్తగూడెంటౌన్: తాను ధరించిన చున్నీ ద్విచక్ర వాహనంలో చిక్కుకోవడంతో కింద పడి ఓ మహిళా ఎస్ఐ తీవ్రంగా గాయపడ్డ సంఘటన శనివారం రాత్రి జరిగింది. కొత్తగూడెం టూటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. కొత్తగూడెం టూటౌన్ ఎస్ఐగా పనిచేస్తున్న జుబేదా గౌతంపూర్‌లో నివాసం ఉంటున్నారు. శనివారం రాత్రి భర్త ఫహీంతో కలిసి రామవరంలోని బంధువుల ఇంట్లో శుభకార్యానికి ద్విచక్రవాహనంపై వెళ్లి వస్తున్నారు. ఈ క్రమంలో రుద్రంపూర్ ఐటీఐ వద్ద ఆమె ధరించిన చున్నీ ద్విచక్ర వాహనంలోని వెనుక చక్రంలో చిక్కుకుంది. దీంతో ఎస్ఐ వాహనంపై నుంచి కిందపడగా తీవ్ర గాయాలయ్యాయి. పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. బలమైన గాయాలు కావడంతో తలలో బ్లడ్ క్లాట్ అయిందని వైద్యులు తెలిపారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతోపాటు ఇక్కడ న్యూరో సర్జన్ లేకపోవడంతో మెరుగైన వైద్యం కోసం డాక్టర్లు ఖమ్మం రిఫర్ చేశారని పోలీసులు తెలిపారు. కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, సీఐలు, ఎస్ఐలు ఆస్పత్రికి చేరుకుని పరామర్శించారు.

ఇద్దరు మిత్రులకు అంతిమ వీడ్కోలు


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రేగా కాంతారావు


అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరు మిత్రులు కందిమళ్ల శ్రీధర్‌రెడ్డి, ఎడ్ల సంతోష్‌రెడ్డి మృతదేహాల వద్ద శనివారం స్థానికులు, బంధువులు, మిత్రులు నివాళులర్పించారు. కన్నీటి వీడ్కోలు పలికారు. ఇద్దరు మిత్రులు ఒకే ప్రమాదంలో మృతి చెందడం స్థానికులను కలచివేసింది. ఎమ్మెల్యే రేగా కాంతారావు, మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయోధ్య, సర్పంచ్ మర్రి మల్లారెడ్డి, పలు పార్టీల నాయకులు, స్థానికులు వారి మృతదేహాలను సందర్శించి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. మీసేవ కేంద్రం నిర్వాహకుడు శ్రీధర్‌రెడ్డి మృతితో జిల్లా వ్యాప్తంగా మీసేవలు బంద్ చేశారు. మొండికుంటలో దుకాణాలు బంద్ చేశారు. మీసేవ వెల్ఫేర్ కమిటీ జిల్లా అధ్యక్షుడు నరేష్, ప్రధాన కార్యదర్శి రామారావు, నియోజకవర్గ అధ్యక్షుడు రాజేందర్, మీ సేవ కేంద్రాల జిల్లా అధికారులు ఈడీఎం విజయసారథి, డీఎం రఘు తదితరులు శ్రీధర్‌రెడ్డి మృతి పట్ల సంతాపం తెలిపారు.

నాటుసారా స్వాధీనం

జూలూరుపాడు: ద్విచక్రవాహనంపై నాటుసారా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గుండ్లరేవు గ్రామానికి చెందిన భూక్యా నరేష్, అతని స్నేహితుడు వరంగల్‌కు చెంది భట్టు మురళిని అన్నారుపాడు సమీపంలో పట్టుకుని 4 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పురుషోత్తం తెలిపారు. వాహనాన్ని సీజ్ చేసి, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

విషాదం మిగిల్చిన సెలవుల సరదా

ఈతకెళ్లి పదో తరగతి విద్యార్థి మృతి


కార్తీక్ (ఫైల్)

ఇల్లెందురూరల్: పండుగ సెలవుల్లో సరదా గడిపేందుకు అమ్మమ్మగారి ఇంటికి వెళ్లిన విద్యార్థి అనంతలోకాలకు చేరాడు. దీంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పోలారం గ్రామపంచాయతీ భద్రుతండా గ్రామానికి చెందిన వాంకుడోత్ శంకర్, సరోజ దంపతులకు ఇద్దరు సంతానం. కుమార్తెకు వివాహం చేయగా, కుమారుడు కార్తీక్ (15) భద్రాచలంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. దసరా సెలవులకు ఇంటికి రాగా పండుగకు ముందు మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం బక్కతండా గ్రామంలోని అమ్మమ్మగారి ఇంటికి వెళ్లాడు. ఆదివారం ఇంటికి తిరిగి రావాల్సి ఉన్న కార్తీక్ శనివారం ఉదయం మేనమామ కుమారుడితో కలిసి గ్రామ సమీపంలోని ఆకేరు వాగులో సరదాగా ఈత కొట్టేందుకు వెళ్లాడు. వాగులో లోతైన ప్రదేశానికి వెళ్లి నీటమునిగి మృతి చెందాడు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురాగా తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్నారు.

అనారోగ్యంతో మెడికో మృతి

ఖమ్మంరూరల్: ఏదులాపురం శివారు వరంగల్ క్రాస్‌రోడ్డుకు చెందిన యువ డాక్టర్ మాధారపు గోపి (27) శనివారం మృతి చెందాడు. కొంత కాలంగా ఆయన జ్వరంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంటున్నాడు. అక్కడే పరిస్థితి విషమించగా మృతి చెందాడు. ప్రస్తుతం గోపి ఎండీ జనరల్ మెడిసిన్ రెండో సంవత్సరం చదువుతుండగా, కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

క్లుప్తంగా...

అంబటిపై దాడి ఘటనలో కేసులు నమోదు

- నిందితులైన ఏడుగురు టీడీపీ నేతల గుర్తింపు
- ఘటనను ఖండించిన మున్నూరు కాపు సంక్షేమ సంఘం

ఖమ్మం మయూరిసెంటర్/ఖమ్మం క్రైం: ఖమ్మంలో శుక్రవారం ఏపీ మంత్రి అంబటి రాంబాబు కాన్వాయ్‌ను అడ్డుకుని కర్రలతో బీభత్సం సృష్టించిన టీడీపీ నాయకులు కేతినేని హరీశ్, కాంపాటి విజయ్‌కుమార్, రామాంజనేయ, జయ, నర్వనేని శంకర్, నాగండ్ల లక్ష్మిబ్‌రావు, మందడపు కోటిపై ఖమ్మం వన్‌టౌన్ పోలీసులు కేసులు నమోదు చేశారు. ఘటనపై మంత్రి గన్‌మేన్ జంగం కిరణ్ ఫిర్యాదు మేరకు శనివారం నిందితులపై కేసులు నమోదు చేసినట్లు సీఐ స్వామి తెలిపారు. కాగా, శుభకార్యానికి వచ్చిన అతిథులను అగౌరవపరచడం, దాడులకు ప్రయత్నించడం సంప్రదాయం కాదని, ఏపీ మంత్రి అంబటిని దుర్భాషలాడుతూ దాడికి యత్నించడం గర్హనీయమని మున్నూరుకాపు సంక్షేమ సంఘం పేర్కొంది. ఈ మేరకు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు పారా నాగేశ్వరరావు, రాష్ట్ర బాధ్యులు ఆకుల గాంధీ, శెట్టి రంగారావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఏపీలో తేలికపాటి వర్షాలు



సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో కొన్నాళ్లుగా వాతావరణం పొడిగా ఉంది. కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతల్లో మార్పు వల్ల ఉక్కపోత ఉంటోంది. తాజాగా గాలుల దిశ మారిన కారణంగా తూర్పు, ఆగ్నేయ గాలులు రాష్ట్రంపై ప్రభావం చూపుతున్నాయి. దీంతో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నాయి. అదే సమయంలో తేలికపాటి జల్లులు లేదా వర్షాలకు ఆస్కారం ఉందని భారత వాతావరణశాఖ శనివారం ఓ నివేదికలో తెలిపింది. రానున్న మూడు రోజుల్లో కోస్తాంధ్ర, రాయలసీమల్లో ఒకట్రెండు చోట్ల జల్లులు గాని, తేలికపాటి వర్షం గాని కురవవచ్చని పేర్కొంది. అదే సమయంలో ఉరుములు, మెరుపులకు ఆస్కారం ఉందని అంచనా వేసింది.





వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో జరిగిన సామాజిక సాధికార యాత్రకు హాజరైన జనసందోహం • విశాఖ జిల్లా తగరపువలస సభలో పాల్గొన్న అశేష జనవాహిని

సామాజిక విప్లవ సారథి జగన్‌కు జేజేలు

- మూడో రోజూ ప్రభంజనంలా వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర
- భీమిలి, బాపట్ల, ప్రొద్దుటూరు నియోజకవర్గాల్లో యాత్రకు విశేష స్పందన
- రేపు పాడేరు, దెందులూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లో బస్సు యాత్ర

సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం/ సాక్షి, బాపట్ల/సాక్షి, కడప: సామాజిక విప్లవ సారథి వైఎస్ జగన్ పరిపాలనకు ప్రజలు అడుగడుగునా జేజేలు పలుకుతున్నారు. వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార యాత్రను హర్షాతిరేకాలతో స్వాగతిస్తున్నారు. 'జగనన్నే మా భవిష్యత్తు.. జగనే రావాలి.. జగనే కావాలి' అంటూ అన్ని వర్గాలూ ఒక్క గళమై నినదిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రకు మూడో రోజు శనివారం ప్రజలు నీరాజనం పలికారు. గత 53 నెలలుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణ పేదలకు చేస్తున్న మంచిని వివరించడానికి సీఎం జగన్ నాయకత్వంలో వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార యాత్ర శనివారం విశాఖ జిల్లా భీమిలి, బాపట్ల జిల్లా బాపట్ల, వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో జరిగింది. ఈ బస్సు యాత్ర సోమవారం అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు, ఏలూరు జిల్లా దెందులూరు, పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గాల్లో జరగనుంది.

జగనే కావాలి అంటూ హోరెత్తిన భీమిలి

భీమిలిలో స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రను ఎండాడలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రులు బొత్స సత్యనారాయణ, మేరుగు నాగార్జున, సీదిరి అప్పలరాజు, కారుమూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. ఆనందపురం మండలం బోయిపాలెం కూడలి నుంచి 2 వేలకు పైగా బైక్‌లు, వందకు పైగా కార్లతో ర్యాలీగా యాత్ర ప్రారంభమై జాతీయ రహదారి మీదుగా తగరపువలస చిట్టివలస ఫుట్‌బాల్ గ్రౌండ్ వద్ద గల బహిరంగ సభ స్థలి వద్దకు చేరింది. పర్యటన ఆసాంతం 'జగనే కావాలి – జగనే రావాలి'అంటూ ప్రజలు చేసిన నినాదాలతో హోరెత్తింది.

బాపట్లలో అపూర్వ స్పందన

బాపట్ల నియోజకవర్గంలో బస్సు యాత్రకు అపూర్వ స్పందన లభించింది. యాత్రకు ప్రజలు పూల తివాచీలతో ఘనస్వాగతం పలికారు. విద్య, వైద్యం తదితర విభాగాల్లో జరిగిన అభివృద్ధిని ఎంపీ విజయసాయిరెడ్డి ప్రజలకు వివరించారు. యాత్ర రెడ్డిపాలెం, కర్లపాలెం మీదుగా సాయంత్రం 5.30 గంటలకు బాపట్ల చేరుకుంది. నియోజకవర్గంలోని యువకులు అధిక సంఖ్యలో ద్విచక్రవాహనాలతో భారీ ర్యాలీ చేశారు. అంబేడ్కర్ సెంటర్‌లో సభ జరిగింది. వైఎస్ జగన్ సీఎం అయిన తర్వాత బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చేస్తున్న మేలును మంత్రులు వివరించిన సమయంలో ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

జనసంద్రంగా మారిన పసిడిపురి

పసిడిపురి ప్రొద్దుటూరులో సామాజిక సాధికార యాత్ర జనజాతరలా సాగింది. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి నియోజకవర్గ నేతలతో కలిసి బస్సు ముందు నడుస్తుండగా మహిళలు వైఎస్సార్‌సీపీ జెండాలతో స్వాగతం పలికారు. యువత భారీ బైక్ ర్యాలీ చేశారు. శివాలయం సెంటర్‌లో అసంఖ్యాక జనం మధ్య బహిరంగ సభ జరిగింది. దసరా ఉత్సవాలకు పసిడిపురి పెట్టింది పేరు. భారీ స్థాయిలో ప్రజానీకం వీటిని వీక్షిస్తుంటారు. శనివారం సామాజిక సాధికార యాత్ర కూడా ఇదే ఉత్సవాలను తలపించింది.

సిటీ ఆఫ్ డెస్టినీ.. విశాఖ

- అత్యంత ప్రభావవంతమైన విద్యా సంస్థలు, పరిశ్రమలకు నగరం నిలయం
- ఆంధ్రా వైద్య కళాశాల శతాబ్ది ఉత్సవాల్లో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్

సాక్షి, విశాఖపట్నం: అత్యంత ప్రభావవంతమైన విద్యాసంస్థలు, పరిశ్రమలతోపాటు ఆకర్షణీయమైన బీచ్‌లు ఉన్న విశాఖ నగరం నిజంగా 'సిటీ ఆఫ్ డెస్టినీ'అని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ కొనియాడారు. ముఖ్యంగా హైటెక్ వైద్య పరికరాల తయారీ, ఎగుమతుల్లో విశాఖపట్నంలోని ఏపీ మెడ్‌టెక్ జోన్ ప్రపంచంలోనే కీలక పాత్ర పోషిస్తోందన్నారు. మరింత పురోభివృద్ధి సాధించేందుకు అవసరమైన నిపుణులు రాష్ట్రంలో ఉన్నారని ప్రశంసించారు. ఆంధ్రా వైద్య కళాశాల (ఏఎంసీ) శతాబ్ది ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరయ్యేందుకు ఉపరాష్ట్రపతి జగదీప్ ధనకర్ శనివారం విశాఖ చేరుకున్నారు. ముందుగా ఐఎన్ఎస్ డేగాలో తూర్పు నౌకాదళం, రాష్ట్ర ప్రభుత్వం అందించిన గార్డ్ ఆఫ్ ఆనర్, గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం అక్కడి నుంచి నేరుగా ఆంధ్రా వైద్య కళాశాలకు చేరుకున్న ఉపరాష్ట్రపతి ఏఎంసీ శతాబ్ది ఉత్సవాల పైలాన్‌ని గవర్నర్ అబ్దుల్ నజీర్, మంత్రులు విడదల రజని, గుడివాడ అమర్‌నాథ్, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, సత్యవతితో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఏఎంసీలో రూ.20 కోట్లతో నిర్మించనున్న క్లినికల్ అండ్ బయోమెడికల్ రీసెర్చ్ సెంటర్‌కు జగదీప్ ధన్‌ఖడ్ శంకుస్థాపన చేసి.. కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఆ తర్వాత బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన ఉత్సవాల సదస్సులో పాల్గొన్నారు. ఏఎంసీ సెంటినరీ కాఫీ బుక్, పోస్టల్ కవర్, స్టాంప్‌ని ఆవిష్కరించారు.



ఆంధ్రా మెడికల్ కాలేజీ వద్ద విద్యార్థులతో ముచ్చటిస్తున్న ఉప రాష్ట్రపతి జగదీప్

శ్రీవారి సేవలో హైకోర్టు సీజే



ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ శనివారం శ్రీవారిని, తిరుచానూరు పద్మావతి అమ్మవారిని కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. వారికి అధికారులు ప్రసాదాలు, వేద పండితులు ఆశీర్వచనాలు అందజేశారు.

టీటీడీ డైరీలు, కేలండర్ల విక్రయం

తిరుమల: టీటీడీ ముద్రించిన 2024వ సంవత్సరం డైరీలు, కేలండర్లను తిరుమల, తిరుపతిల్లోని అన్ని టీటీడీ పుస్తక విక్రయశాలల్లో విక్రయిస్తున్నారు. ttdevasthanams.ap.gov. in లో కేలండర్లు, డైరీలు, టేబుల్ టాప్ కేలండర్లను కొనుగోలు చేయవచ్చు. 12 పేజీల కేలండర్ రూ.130, డైరీ (డీలక్స్) రూ.150, డైరీ (చిన్నది) రూ.120, టేబుల్ టాప్ కేలండర్ రూ.75, ఆరు పేజీల కేలండర్ రూ.450, శ్రీవారిపెద్ద కేలండర్ రూ.20, శ్రీవారు, శ్రీ పద్మావతి అమ్మవారి కేలండర్ రూ.15, శ్రీ పద్మావతి పెద్ద కేలండర్ రూ.20, తెలుగు పంచాంగం కేలండర్ రూ.30గా ధరను టీటీడీ నిర్ణయించింది. చెన్నైలోని శ్రీ వేంకటేశ్వరస్వామి, శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయాలు, హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ, విశాఖల్లోని శ్రీవారి ఆలయాలు, ముంబై, న్యూఢిల్లీ, వేలూరు, కాంచీపురంలోని సమాచార కేంద్రాలు, నెల్లూరు, రాజమహేంద్రవరం, కాకినాడ, కర్నూలుల్లోని టీటీడీ కల్యాణమండపాల్లో కేలండర్లు, డైరీలు విక్రయాల కోసం అందుబాటులో టీటీడీ ఉంచింది.

విజయవాడలోనూ పాస్‌పోర్ట్ ప్రింటింగ్

- జనవరి నుంచి నూతన ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయం
- విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారి శివహర్ష



సాక్షి, అమరావతి: 2024 జనవరి నుంచి విజయవాడలో కొత్త ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రాంతీయ పాస్ట్‌పోర్ట్ అధికారి శివహర్ష వెల్లడించారు. విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయ(ఆర్‌పీవో) అధికారులతో శనివారం ఆయన సమన్వయ సమావేశం నిర్వహించి.. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఇప్పటి వరకు విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయం సేవా కేంద్రంగా ఉందని.. గవర్నర్‌పేటలోని ఏజీ ఆఫీస్ కాంప్లెక్స్‌లో వచ్చే జనవరి నుంచి ప్రారంభించే కొత్త ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయం విస్తృత సేవలు అందించనుందని తెలిపారు. ప్రస్తుతం విశాఖపట్నం ప్రాంతీయ కార్యాలయంలోనే పాస్‌పోర్ట్ ప్రింటింగ్ సౌలభ్యం ఉందని, ఇకపై విజయవాడ నూతన కార్యాలయంలోనూ ఈ సేవలు అందుబాటులోకొస్తాయన్నారు. పాస్‌పోర్ట్ ప్రింటింగ్, డిస్పాచ్‌తో పాటు అడ్మినిస్ట్రేషన్(పరిపాలన), పాలసీ సంబంధిత సేవలనూ విజయవాడ కార్యాలయం అందిస్తుందని తెలిపారు. ఏపీలోని 15 జిల్లాలకు చెందిన పాస్‌పోర్ట్ దరఖాస్తుదారులకు విజయవాడ, తిరుపతి పాస్‌పోర్ట్ సేవా కేంద్రాలు(పీఎస్‌కే), 13 పోస్ట్ ఆఫీస్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల(పీఓపీఎస్‌కే) ద్వారా సేవలందిస్తున్నామని, మిగతా జిల్లాలకు విశాఖ ప్రాంతీయ కార్యాలయం సేవలందిస్తుందని చెప్పారు. గతంలో పాస్‌పోర్ట్ స్లాట్ బుకింగ్‌కు నెల పట్టేదని, ప్రస్తుతం ఐదు నుంచి 12 రోజులే పడుతోందన్నారు. విజయవాడ కార్యాలయ పరిధిలో రోజుకు 2 వేల పాస్‌పోర్ట్ దరఖాస్తులను క్లియర్ చేస్తున్నట్టు తెలిపారు. పాస్ట్‌పోర్ట్ సేవల వినియోగానికి అధికారిక వెబ్‌సైట్‌ను వినియోగించుకోవాలని, నకిలీ వెబ్‌సైట్‌లు, ఏజెంట్లను నమ్మొద్దని కోరారు.

జిల్లా వార్తలు

'శ్రౌత యజ్ఞ పరిచయం' గ్రంథావిష్కరణ



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న స్వరూపానందేంద్ర స్వామి

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం రామాయణ పారాయణదారులు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు రచించిన 'శ్రౌత యజ్ఞ పరిచయం' గ్రంథాన్ని శనివారం ఆవిష్కరించారు. విశాఖపట్నంలోని శారదా పీఠంలో ఈ గ్రంథాన్ని పీఠాధిపతి శ్రీ స్వరూపానందేంద్ర స్వామి ఆవిష్కరించి ఆశీర్వదించారు. అనంతరం స్వామిజీ మాట్లాడుతూ.. తెలుగులో శ్రౌత యజ్ఞాలపై గ్రంథ రచనలు లేవని, ఆ ప్రయత్నంలో విజయం సాధించిన కృష్ణమాచార్యులు అభినందనీయుడని తెలిపారు. శ్రౌత యజ్ఞసభలు ప్రతీ మాఘమాసంలో శారదా పీఠంలో నిర్వహిస్తామని, తెలుగు నాట సభలు నిర్వహించే ఏకైక పీఠం విశాఖ శారదా పీఠమేనని వెల్లడించారు. కార్యక్రమంలో పలువురు ఆధ్యాత్మిక వేత్తలు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్‌లో నల్లకొమ్ము పురుగు



తోటలో పరిశీలిస్తున్న జినుగు మరియన్న

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఆయిల్‌పామ్‌తో పాటు కొబ్బరి తోటల్లో లేత ఆకులను నల్లకొమ్ము పురుగు ఆశించినట్లు అధికారులు గుర్తించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని సుజాతనగర్, జూలూరుపాడు, చండ్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, లక్ష్మీదేవిపల్లి మండలాల్లో సాగుచేస్తున్న ఆయిల్‌పామ్, డ్రాగన్‌ఫ్రూట్, మామిడి, జామ, బొప్పాయి, అరటి, కూరగాయల తోటలను శనివారం జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖాధికారి జినుగు మరియన్న సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నల్లకొమ్ము పురుగు ఆయిల్ పామ్, కొబ్బరి తోటలను నష్టపరుస్తోందని తెలిపారు. ఈ మేరకు 20 గ్రాముల ఫోరెట్ గుళికలను మొవ్వలో పెట్టాలని, లింగాకర్షణ బుట్టలు వాడాలని సూచించారు. అలాగే, జీవ నియంత్రణ పద్ధతులు పాటించాలని పేర్కొన్నారు.

పేదలకు 'పెద్ద' సేవలు

- జిల్లా ఆస్పత్రిలో వేయి దాటిన క్యాథల్యాబ్ చికిత్సలు
- ఇరవై నెలల్లో ఓపీ 16,169గా నమోదు
- నిరుపేదలకు తప్పుతున్న వ్యయప్రయాసలు



కార్డియాలజీ విభాగం వైద్యులు, సిబ్బందిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, తదితరులు

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం జిల్లా ప్రధాన ఆస్పత్రిలో ఇటీవల క్యాథల్యాబ్ సేవలకు తరచూ అంతరాయం కలుగుతున్నా గుండె సంబంధిత వ్యాధులతో బాధపడే వారికి చికిత్స విషయంలో జోరు తగ్గడం లేదు. క్యాథల్యాబ్ ద్వారా ఇప్పటి వరకు వేయి మందికి వివిధ రకాల శస్త్రచికిత్స నిర్వహించిన వైద్యులు, సిబ్బంది భేష్ అనిపించుకున్నారు. గుండె వైద్య నిపుణులు డాక్టర్ సీతారాం, సిబ్బంది కృషితో వైద్యసేవలు మెరుగుపడ్డాయి. తరచూ కాంట్రాస్ట్ ఇంజక్షన్ల సరఫరాలో అంతరాయం కలుగుతున్నా, బయట నుండి తెప్పించి మరీ చికిత్స కొనసాగిస్తుండడంతో నిరుపేదలకు లబ్ధి జరుగుతోంది.

గత ఏడాది ఫిబ్రవరిలో ప్రారంభం

ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో క్యాథలాబ్ సేవలు గత ఏడాది ఫిబ్రవరి 23వ తేదీన ప్రారంభించారు. సుమారు రూ.7 కోట్ల వ్యయంతో ఏర్పాటుచేసిన యంత్రాల ద్వారా సేవలు విస్తృతమయ్యాయి. గడిచిన ఇరవై నెలల కాలంలో గుండె విభాగానికి 1,004 మందికి శస్త్రచికిత్సలు నిర్వహించడం విశేషం. గతంలో మాదిరి హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లనవసరం లేకుండా జిల్లా కేంద్రంలో ఉచితంగా చికిత్స అందుబాటులోకి రావడంతో నిరుపేదలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. క్యాథల్యాబ్ ద్వారా యాంజియోగ్రామ్, యాంజియోప్లాస్టీ, ఫేస్‌మేకర్లు, గుండె సంబంధిత లోపాలు తెలుసుకుని చికిత్స అందిస్తున్నారు. గుండె కొట్టుకోవటంలో లోపాలు ఈ మిషన్ ద్వారా తెలుసుకొని సరిచేయడం, గుండెకు రక్తాన్ని తీసుకెళ్లే నాళాలు పాడైతే స్టంట్లు వేయడం జరుగుతోంది. గుండె కవాటాల మార్పిడి, గుండె చుట్టూ నీరు చేరితే తొలగింపు, గుండెకు రక్తం పంపింగ్‌లోనూ లోపాలను సరిచేయడమే కాక చిన్నపిల్లల గుండెకు రంధ్రం పడితే వాటిని పూడ్చడానికి ఇక్కడ అన్ని వసతులు సమకూరాయి.

ఉద్యోగులకు అభినందల వెల్లువ

క్యాథల్యాబ్ ద్వారా పెద్దాస్పత్రిలో వేయి చికిత్సలు విజయవంతంగా పూర్తిచేసిన సందర్భంగా కార్డియాలజీ విభాగంలో శనివారం ఉద్యోగులను అభినందించారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు, సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు, ఆర్‌ఎంఓ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యాన కేక్ కట్ చేశారు. గడిచిన ఇరవై నెలల్లో ప్రభుత్వ పరంగా 1,004 మంది గుండె సంబంధిత బాధితులకు శస్త్రచికిత్స చేయడంపై అభినందించారు. ఇందులో కరోనరీ యాంజియోగ్రామ్ 604, యాంజియోప్లాస్టీ 352, టెంపరరీ ఫేస్ మేకర్ ఇంప్లాటేషన్ 17, రేనల్ యాంజియోగ్రామ్ 11, పెరికార్డియో సెంటిసిస్ 10, పెరిపెరల్ యాంజియోగ్రామ్, గ్రాఫ్ట్ యాంజియోగ్రామ్, కరోటిడ్ యాంజియోగ్రామ్ రెండేసి చొప్పున ఉన్నాయి. అలాగే, బ్రాంకియల్ యాంజియోగ్రామ్, రూట్ యాంజియోగ్రామ్, వెంట్రికులర్ సెప్టల్ డివైస్ క్లోజర్, ఫ్లూరోస్కోపీ పోస్ట్ ఎంవీఆర్ చికిత్స ఒక్కొక్కటి ఉంది.

విస్తృతమైన ఓపీ సేవలు

గతంలో ఇక్కడ ప్రభుత్వ పరంగా గుండె రోగులకు సంబంధించి చికిత్స అందుబాటులో లేదు. దీంతో ప్రైవేట్ ఆస్పత్రులే దిక్కయ్యేవి. ఖరీదైన వైద్యం కావటంతో స్థోమత ఉన్న వారు హైదరాబాద్ తదితర పట్టణాలకు వెళ్లి వైద్యం చేయించుకునే వారు. కానీ నిరుపేదలకు ఆ అవకాశం లేక గాలిలో దీపం పెట్టిన చందంగా బతుకుపై ఆశలు వదిలేసుకునేవారు. అయితే, జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కార్డియాలజీ విభాగం ఏర్పాటైన తర్వాత పరిస్థితులు మారాయి. నిరుపేదలకు గుండె చికిత్స అందుబాటులోకి రావటంతో ఓపీ సేవలు మెరుగుపడ్డాయి. గడిచిన ఇరవై నెలల కాలంలో 16,169 మంది ఈ విభాగంలో ఓపీ సేవలు పొందారు.

సీఎంపీఎఫ్ అధికారులతో ద్వైపాక్షిక సమావేశం

సింగరేణి(కొత్తగూడెం): పెన్షన్ అదాలత్, సింగరేణి కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు, వితంతు పెన్షన్‌పై సింగరేణి డైరెక్టర్ (పా) ఎన్.బలరామ్ సమీక్షించారు. కొత్తగూడెంలోని కార్పొరేట్ కార్యాలయంలో శనివారం సీఎంపీఎఫ్ అధికారులతో సమావేశమై మాట్లాడారు. పెన్షన్ క్లెయిమ్‌ల పరిష్కారం, రివైజ్డ్ నామినేషన్ ఫారంలు సమర్పించేటప్పుడు కుటుంబ సభ్యులు / డిపెండెంట్ల పాన్‌కార్డ్, ఆధార్‌కార్డులు జత చేయాలని సూచించారు. సీఎంపీఎఫ్ సంస్థ ద్వారా జారీ చేసిన పీఎఫ్, పెన్షన్ క్లెయిమ్ సెటిల్‌మెంట్ కోసం ఎస్‌ఓపీ అమలు చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులందరికీ సీఎంపీఎఫ్ వర్తింపజేయాలని తెలిపారు. ఆ తర్వాత పెన్షన్ గ్రీవెన్స్ సమస్యలపై చర్చించారు. సమావేశంలో జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ ఆర్సీ) కట్టా బసవయ్య, సీఎంపీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ ఎం.కనకమ్మతోపాటు అధికారులు ఎం.సుబ్బారావు, సూర్యనారాయణ, కోడూరు శ్రీనివాసరావు, వైవీఎల్ వరప్రసాద్, ఎస్.వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, వేణుగోపాల్‌రావు, రాజేశ్వరరావు, ఎల్.తిరుపతి, కె.ప్రవీణ్ కుమార్, పీఎంకే.ప్రసాద్, వెంకటేశ్వర్లు, మధుబాబు, వి.సులోచన తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ అదాలత్‌పై సమీక్షించిన సింగరేణి డైరెక్టర్



మాట్లాడుతున్న డైరెక్టర్ బలరామ్

గిరిజనులపై మావోయిస్టుల దాష్టీకం

భద్రాద్రి జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్




బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న ఎస్పీ

చర్ల: సరిహద్దు అటవీ ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనులపై మావోయిస్టులు వ్యవహరిస్తున్న తీరు సరికాదని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ పేర్కొన్నారు. పోలీసులను లక్ష్యంగా చేసుకుని మావోయిస్టులు ఏర్పాటు చేసిన ప్రెజర్ బాంబు దాటికి పూసుగుప్పకు చెందిన ఓ గిరిజనుడి ఆవు మృతి చెందింది. దీంతో శనివారం గ్రామానికి వచ్చిన ఎస్పీ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అడవినే నమ్ముకొని జీవనాన్ని సాగిస్తున్న ఆదివాసీలు, గిరిజనులపై దాడులు చేయడం, విధ్వంసాలకు పాల్పడడం మావోయిస్టులకు అలవాటుగా మారిందని విమర్శించారు. కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషిస్తున్న ఆదివాసీలు, గిరిజనుల దగ్గర నుంచి సమావేశాల పేరుతో బలవంతంగా వసూళ్లకు పాల్పడుతున్నారని చెప్పారు. అంతేకాక పనులు మానుకుని సభలకు రావాలని హెచ్చరించడం ఏమిటని ప్రశ్నించారు. అటవీ ప్రాంతాల్లో నిత్యం గిరిజనులు సంచరిస్తుంటారని, ఈ క్రమంలో పోలీసులను లక్ష్యంగా చేసుకొని మావోయిస్టులు ఏర్పాటు చేస్తున్న ప్రెజర్ బాంబుల తీరుతో వారి ప్రాణాలు పోతే ఎవరు బాధ్యత వహిస్తారో చెప్పాలని నిలదీశారు. కాగా, ఆదివాసీల మనుగడకు ముప్పుగా, అభివృద్ధికి ఆటంకంగా మారిన మావోయిస్టులను గ్రామాల్లోకి రాకుండా తరిమికొట్టాలని ఎస్పీ పిలుపునిచ్చారు. అనంతరం బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. భద్రాచలం ఏఎస్పీ పరితోజ్ పంకజ్, ఓఎస్డీ టి.సాయిమనోహర్, సీఐలు బి.రాజగోపాల్, రాజువర్మ పాల్గొన్నారు.

సీఎం సభలకు చకచకా ఏర్పాట్లు

భారీగా జన సమీకరణకు కసరత్తు



సభా వేదికను పరిశీలిస్తున్న ఎంపీ రవిచంద్ర, నాయకులు

ఇల్లెందు/కామేపల్లి/పాల్వంచ: ఎన్నికల ప్రచారంలో భాగంగా వచ్చేనెల 1వ తేదీ ఇల్లెందు నియోజకవర్గ స్థాయి ప్రజా ఆశీర్వాద సభకు సీఎం కేసీఆర్ హాజరు కానున్నారు. ఇందుకోసం మండలంలోని మొట్లగూడెం వెళ్లే దారిలో సుమారు 15 ఎకరాల స్థలాన్ని ఎంపిక చేశారు. ఇప్పటికే అక్కడ సభావేదిక, బారికేడ్ల నిర్మాణం, హెలీప్యాడ్ ఏర్పాటుపై దృష్టి సారించారు. శనివారం బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మైదానాన్ని పరిశీలించారు. తొలుత ఇల్లెందులోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ముఖ్యనేతలతో సమావేశమై సభకు జనం తరలింపు, తదితర అంశాలపై సూచనలిచ్చారు. అలాగే, కామేపల్లి మండలం కొత్తలింగాలలో జరిగిన సమావేశంలో కూడా ఎంపీ వద్దిరాజు పాల్గొని జనసమీకరణపై సూచనలు చేశారు. గ్రంథాలయ సంస్థ భద్రాద్రి జిల్లా చైర్మన్ దిండిగల రాజేందర్, నాయకులు బానోత్ హరిసింగ్‌నాయక్, జానీపాషా, సుధీర్ తోత్లా, సిలివేరు సత్యనారాయణ, మెట్టెల కృష్ణ, జానీబాబా, కృష్ణప్రసాద్, చీమల వెంకటేశ్వర్లు, ధనియాకుల హన్మంతరావు, ఆంతోటి అచ్చయ్య, మూడ్ కృష్ణప్రసాద్‌నాయక్, బోడేపూడి వీరప్రతాప్‌బాబు, వడియాల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇక పాత పాల్వంచలోని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఇంట్లో జరిగిన సమావేశంలో వద్దిరాజు మాట్లాడుతూ నవంబర్ 5వ తేదీన సీఎం కేసీఆర్ హాజరయ్యే బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద సభకు జన సమీకరణపై ఇప్పటి నుంచే దృష్టి సారించాలని సూచించారు. జెడ్పీ, కొత్తగూడెం మున్సిపల్ వైస్ చైర్మన్లు కంచర్ల చంద్రశేఖర్‌రావు, వి.దామోదర్‌తో పాటు నాయకులు సర్దార్, పురుషోత్తంరావు, ఆది విష్ణుమూర్తి, కాసుల వెంకట్, కిలారు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ ఫ్యాక్టరీలో పరిశీలన



పనులపై ఆరాతీస్తున్న ఆయిల్‌ఫెడ్ అధికారులు

దమ్మపేట: మండలంలోని అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీని హైదరాబాద్ ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి, ప్రాజెక్ట్స్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీలో జరుగుతున్న విస్తరణ పనులను పరిశీలించి పురోగతిపై మేనేజర్‌తో సమీక్షించారు. పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తిచేయించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో మేనేజర్ కల్యాణ్, సిబ్బంది రాజేశ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.